సాక్షి
కుమురం భీం

మంగళవారం | 18 | జూలై | 2023



ప్రబలుతున్న వ్యాధులు

సీజనల్ వ్యాధులు దడ పుట్టిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడికక్కడ మురుగునీరు నిలువడంతో దోమలు విజృంభిస్తున్నాయి. 8లో▸



పాఠశాలల్లో పఠన గ్రంథాలు

విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలు పెంచేందుకు ప్రభుత్వం రూం టూ రీడ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పుస్తకాలు చదివేందుకు ఒక పీరియడ్ కేటాయిస్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.4 /24.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాగజ్‌నగర్‌టౌన్: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.విజేశ్, కార్యదర్శి ప్రవీణ్ కోరారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో ఎమ్మెల్సీ దండె విఠల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,804 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కనీస వేతనాలు, పర్మినెంట్ చేసే విషయాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

పోడు పట్టాలు ఇప్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఆసిఫాబాద్: సాగు భూములకు పోడు పట్టాలు ఇప్పించాలని తిర్యాణి మండలం మర్కగూడ పంచాయతీ పరిధిలోని పుర్కగూడకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందించారు. గతేడాది అధికారులు సర్వే చేసినా ఇప్పటివరకు పట్టాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏ పీవోతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

నేడు కుమురంభీం ప్రాజెక్టు వద్ద 'టిఫిన్ బైఠక్'

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మండలంలోని కుమురంభీం ప్రాజెక్టు వద్ద మంగళవారం ఉదయం 11గంటలకు బీజేపీ ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల ఐక్యత చాటేలా సహపంక్తి భోజనాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు భోజనం, టిఫిన్ బాక్స్‌లతో ప్రాజెక్టు వద్దకు రావాలని పిలుపునిచ్చారు.

ఉరితాళ్లతో జీపీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ప్రారంభించిన సమ్మె సోమవారం 12వ రోజుకు చేరింది. దీక్షా శిబిరంలో కార్మికులు తలకు ఉరితాళ్లతో వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా 11వ పీఆర్సీ, జీవో నం.60ని వెంటనే అమలు చేయాలని సంఘం నాయకులు శ్రీకాంత్, లోకేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, శంకర్, రాజు, సమ్మయ్య, శ్రీనివాస్ కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. హుడ్కిలి గ్రామానికి చెందిన వికాస్ (20) అనే యువకుడు మోటారు సైకిల్‌పై సిర్పూర్ (టి) నుంచి పెద్దబండ గ్రామం వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎన్నేళ్లో దారిద్ర్యం!



▲ దహెగాం మండలం లగ్గాం గ్రామానికి అనాల శేఖర్ సోమవారం పత్తి విత్తనాలు కొనేందుకు పెంచికల్‌పేట్‌కు వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తుండగా లగ్గాం శివారు నుంచి పెంచికల్‌పేట్ పెద్దవాగు వరకు వేసిన మట్టి రోడ్డుపై బురదలో బండి ఇరుక్కుపోయింది. బైక్ ముందుకు కదలకపోవడంతో కొద్దిసేపు ఆగి టైర్లపై బురదను తొలగించాడు. నెమ్మదిగా ఇంటికి చేరుకున్నాడు. వర్షాకాలం పూర్తయ్యే వరకు తమకు ఈ ఇబ్బందులు తప్పవని అతడు పేర్కొన్నాడు. జిల్లాలోని చాలా గ్రామాలకు వెళ్లేరోడ్లు బురదతో అధ్వానంగా మారాయి.



దహెగాం నుంచి పెంచికల్‌పేట్ మీదుగా వెళ్లేదారి దుస్థితి

- ప్రయాణం ప్రాణసంకటం
- వర్షాలకు అధ్వానంగా మట్టిరోడ్లు
- నడక కూడా కష్టమే..
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

దహెగాం(సిర్పూర్): ఏటా వర్షాకాలంలో జిల్లా వాసులను రవాణా కష్టాలు వెంటాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే మట్టిరోడ్లు చినుకులకు బురదగా మారి రాకపోకలు కష్టమవుతున్నాయి. మట్టిరోడ్డుపై కనీసం అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేక ఆదివారం దహెగాం మండలం లోహ గ్రామానికి చెందిన నిండుగర్భిణి ప్రమీలను కర్జి వరకు ఆరుకిలోమీటర్ల దూరం ఎడ్లబండిపైనే తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడి నుంచి అంబులెన్స్‌లో దహెగాం పీహెచ్‌సీకి తరలించారు. అదృష్టవశాత్తు సకాలంలో ఆస్పత్రికి చేరడంతో రాత్రి 11 గంటల సమయంలో ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

297 గ్రామీణ రహదారులు

జిల్లా వ్యాప్తంగా 2,060 కిలోమీటర్ల రహదారులు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 412 కిలోమీటర్లు డబుల్ రోడ్డు, 22 కిలోమీటర్లు ఇంటర్మీడియల్ లైన్, 584 కిలోమీటర్ల మేర సింగిల్ లైన్, 80 కిలోమీటర్లు అంతర్రాష్ట్ర రహదారి, 652 కిలోమీటర్లు జిల్లా రహదారులు, 297 కిలోమీటర్లు గ్రామీణ రహదారులు ఉన్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు కల్వర్టులు, వంతెనలు, రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు చాలాచోట్ల మరమ్మతులు పూర్తికాలేదు. అనేక గ్రామాలకు నేటికీ మట్టిరోడ్లే ఉన్నాయి. చిన్నపాటి చినుకులకే అవి బురదగా మారుతున్నాయి. ప్రయాణికులకు ఈ దారులు నిత్యం నరకం చూపిస్తున్నాయి.

'దహెగాం' వాసులకు ఏటా కష్టాలే..

చినుకుపడితే దహెగాం వాసులు భయపడుతున్నారు. అందవెల్లి తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో ప్రజలు వాగులో నుంచే ప్రమాదకరంగా మోకాళ్లలోతు నీటిలో కాలినడకన, నాటుపడవలతో దాటుతున్నారు. పెంచికల్‌పేట్ మీదుగా వెళ్లేందుకు పెద్దవాగు వంతెన వద్ద మొరంతో వేసిన అప్రోచ్ రోడ్డు బురదగా మారింది. బెల్లంపల్లికి వెళ్లాలన్నా కన్నెపల్లి మండలం వెంకటాపూర్ నుంచి కన్నెపల్లి స్టేజీ వరకు రోడ్డు సైతం అధ్వానంగా మారింది.

- పెంచికల్‌పేట్ మండలం ఆగర్‌గూడ నుంచి కమ్మర్‌గాం వరకు ఉన్న మట్టిరోడ్డు బురదమయంగా మారింది. ఎల్లూర్, పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై ప్రజలు అవస్థలు పడుతున్నారు.
- వాంకిడి మండలం సోయంగూడ, పూనగూడ, ఎనోలి, పిప్పర్‌గోంది, హాకిని, ఖిరిడి, తేజిగూడ గ్రామాలకు ఇప్పటికీ మట్టిరోడ్లే ఉన్నాయి.
- సిర్పూర్(టి) మండలం చీలపెల్లి నుంచి పోసిగూడ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. అలాగే సిర్పూర్ నుంచి ఇటిక్యాల పహాడ్ వరకు రోడ్డు లేదు. ఎన్నికల ముందు ఈ గ్రామాలకు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు.
- తిర్యాణి మండలం రాంపెల్లికి వెళ్లే రోడ్డుపై ప్రజలు అవస్థలు పడుతున్నారు. గుండాల, వాడిగూడ, ధాబాగూడ, కొత్తగూడ, సాల్పలాగూడ, దొడ్డిగూడ, పూనగూడ, కెరెగూడ, గోదేనా, గోపెరాకు వెళ్లేరోడ్లు దారుణంగా ఉన్నాయి.

రోడ్డు అధ్వానంగా ఉంది



పనిమీద బాబాసాగర్ నుంచి దహెగాం వెళ్తున్నా. పెంచికల్‌పేట్ నుంచి లగ్గాం ఎక్స్‌రోడ్డు వరకు రోడ్డు బురదగా ఉంది. బైక్‌తో కూడా వెళ్లడం సాధ్యం కావడం లేదు. టైర్లు జారుతున్నాయి. ఒకసారి ప్రయాణానికే నరకం కనిపించింది. రోజూ ఇక్కడివారు ఎలా వెళ్తున్నారో..?

– సురేశ్, బాబాసాగర్, చింతలమానెపల్లి

ఏళ్లుగా ఇదే గోస



కౌఠి, పార్డి, సాండ్‌గాంకు మట్టిరోడ్డు ఉంది. ఏళ్లుగా ఇదే గోస పడుతున్నాం. రోడ్డు మంజూరైందని చెబుతున్నా పనులు మాత్రం ప్రారంభించలేదు. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– రాజ్‌కుమార్, కౌఠి, మం.కౌటాల



ఇది చింతలమానెపల్లి మండలం డబ్బా నుంచి బారెగూడ గ్రామానికి వెళ్లే దారి. రోడ్డుపై బురదలో వాహనాలు కూరుకుపోతున్నాయి. వర్షాలకు రోడ్డంతా బురదగా మారి రాకపోకలకు ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. శివపెల్లి, హేటిగూడ, గంగాపూర్, కోర్సిని గ్రామాలకు సైతం రోడ్లు సరిగ్గా లేవు.



ఆసిఫాబాద్ మండలం అప్పలపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఒక్కో గుంతను ఓపికగా దాటితే గాని గ్రామానికి చేరుకోలేం.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు మీదుగానే పార్డి, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాల ప్రజలు కౌటాల మండల కేంద్రానికి చేరుకుంటారు. భారీ వర్షాలకు ముందే రోడ్డు గుంతలమయంగా మారింది. అలాగే కౌఠి గ్రామానికి వెళ్లే రోడ్డు సైతం అధ్వానంగా మారింది. పార్డి, సాండ్‌గాం గ్రామానికి రోడ్డు నిర్మాణానికి ఇటీవల ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భూమిపూజ చేసినా పనులు ప్రారంభం కాలేదు.



బెజ్జూర్ మండల కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఎల్కపల్లి గ్రామం ఉంది. పూర్తిగా మట్టిరోడ్డు కావడంతో గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తోంది. సిద్దాపూర్ నుంచి రంగాపూర్‌కు వెళ్లే రోడ్డు పరిస్థితి ఇలాగే ఉంది.

గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట గురుకుల టీచర్లు సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, గిరిజన, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమశాఖ, మైనార్టీ గురుకులాల్లో కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్, గెస్ట్ తదితర పేర్లతో ప్రభుత్వం నియామకాలు చేపట్టిందన్నారు. వారికి చాలీచాలని వేతనాలు అందిస్తూ పని చేయించుకుంటుందని మండిపడ్డారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో పనిచేసిన వారికి గుర్తింపు లేకుండా పోతుందన్నారు. పనిభారం తగ్గించి సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. టీచర్ల సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందులాల్, మండల అధ్యక్షుడు ఉపేందర్, నాయకులు హేమంత్, రమేశ్, తిరుపతి, చంద్రయ్య, మహేశ్, మారుతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అసమర్థతకు అందవెల్లి బ్రిడ్జి సాక్ష్యం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు
- పెద్దవాగు వద్ద బ్రిడ్జి దీక్ష



మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: స్థానిక ఎమ్మెల్యే అసమర్థతకు ఇప్పటికీ పనులు పూర్తికాని అందవెల్లి బ్రిడ్జి సాక్ష్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు ఆరోపించారు. కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి పెద్దవాగు వంతెన వద్ద బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం బ్రిడ్జి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా హరీశ్‌బాబు మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనుల్లో జాప్యానికి ఎమ్మెల్యే కారణమన్నారు. సిర్పూర్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకునే ఎమ్మెల్యే పనితీరుకు ఇది నిదర్శనమని మండిపడ్డారు. మూడేళ్ల క్రితం వంతెన కుంగిపోతే కనీస మరమ్మతులు చేపట్టకుండా వదిలివేయడంతో వంతెన పూర్తిగా కూలిపోయిందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ అందవెల్లి వంతెన కూలిపోవడంతో రెండు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆత్మారాం, కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, సింగిల్ విండో మాజీ చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ విశ్వేశ్వర్‌రావు, ఓబీసీ మోర్చా నాయకులు వెంకటేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

అన్ని సంఘాలకు ప్రాధాన్యతనివ్వాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సమావేశాలు, సేఫ్టీ కమిటీ సమావేశాల్లో అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని జాతీయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, బీఎంఎస్ ఫిట్ కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. జాతీయ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సమావేశాలకు అన్ని జాతీయ సంఘాలను ఆహ్వానించాలని సింగరేణి డైరెక్టర్ బలరాం ప్రకటించినా స్థానిక యాజమాన్యం సర్క్యులర్ రాలేదనే సాకుతో జాతీయ సంఘాలను సమావేశాలకు పిలవడం లేదన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించకుండా టీబీజీకేఎస్ ఒక్క సంఘమే సమావేశాల్లో ఉండాలని కోరుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జాతీయ సంఘాలను ఆహ్వానించని పక్షంలో సమావేశాలు జరగనివ్వమని హెచ్చరించారు. అనంతరం డీజీఎం నాగభూషణరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, జగ్గయ్య, ఫిట్ కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి నాగరాజు, హెచ్‌ఎంఎస్ ఫిట్ కార్యదర్శి వసీం, నాయకులు రమేశ్, ఐఎన్‌టీయూసీ నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హరిత లక్ష్యం @36లక్షలు

- తొమ్మిదో విడతలో పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం
- సింగరేణి ఆధ్వర్యంలో 5.8 లక్షలు నాటాలని నిర్ణయం
- పంచాయతీ కార్మికుల సమ్మెతో మొక్కల పంపిణీలో జాప్యం



రెబ్బెన నర్సరీలో పంపిణీ చేసేందుకు సిద్ధంగా పండ్ల మొక్కలు

రెబ్బెన(ఆసిఫాబాద్): తొమ్మిదో విడత తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 36 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితహారం కార్యక్రమం ప్రారంభమైనా సమృద్ధిగా వర్షాలు లేకపోవడంతో మొక్కలు నాటే ప్రక్రియను నిలిపివేశారు. కొన్నిరోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతుండటంతో అధికార యంత్రాంగం హరితహారంపై దృష్టి సారిస్తుంది. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల ద్వారా ఇప్పటికే అవసరమైన మొక్కలను సిద్ధంగా ఉంచారు. త్వరలోనే జిల్లావ్యాప్తంగా మొక్కల పండగ జోరందుకోనుంది.

పంపిణీకి సిద్ధంగా మొక్కలు

జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో ప్రజలకు అవసరమైన అన్నిరకాల మొక్కలు సిద్ధం చేశారు. ఇళ్లలో నాటుకునేందుకు వీలుగా జామ, సీతాఫలం, చింత, నిమ్మ, దానిమ్మ, అల్లనేరేడు, ఉసిరి, ఖర్జూర, డ్రాగన్‌ఫ్రూట్, బొప్పాయి, మునగ, మందారం, గోరంట, చీమచింత మొక్కలతోపాటు ఎవెన్యూ ప్లాంటేషన్ కోసం గుల్మోహర్, కానుగ, మర్రి, రావి, వేప, బహునియా, సీమ తంగెడు, నెమలినార, రేల వంటి అడవి జాతులు పెంచుతున్నారు. ఇప్పటికే కొన్ని పంచాయతీల్లో ఎవెన్యూ ప్లాంటేషన్, తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణం, మల్టీ లేయర్ ఎవెన్యూ ప్లాంటేషన్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో భాగంగా ఆలయాలు, చర్చీలు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. హోంసీడ్స్‌లో భాగంగా ప్రజలకు అందించేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచారు. ప్రస్తుతం పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండటంతో మొక్కల పంపిణీ కార్యక్రమం ఆలస్యమవుతోంది.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి

గతానికి భిన్నంగా ఈసారి తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా పండ్ల తోటల పెంపకం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకనుగుణంగా అధికారులు చర్యలు మొదలు పెట్టారు. రైతుల ఆసక్తి మేరకు అవసరమైన పండ్ల మొక్కలు ప్రభుత్వమే ఉచితంగా అందించనుంది. జిల్లాలో ఈసారి కనీసం పదెకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఆసక్తి ఉన్న రైతులకు మొక్కలు అందించి, ప్రభుత్వమే మొక్కల సంరక్షణ, నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది. జిల్లాలోని తేలికపాటి, ఇసుక నేలలు పండ్ల తోటల పెంపకానికి అనువుగా ఉంటాయని ఉద్యానవనశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సింగరేణి లక్ష్యం: 5.8 లక్షలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో సింగరేణి సంస్థ తనవంతు పాత్ర పోషిస్తోంది. ఏటా లక్షల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోంది. గతేడాది బెల్లంపల్లి ఏరియాలో 5.8 లక్షల మొక్కలు నాటాలని యాజమాన్యం నిర్ణయించగా లక్ష్యాన్ని చేరుకున్నారు. ఈ ఏడాది సైతం 5.8 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని ఏరియా నర్సరీలో మొక్కల పెంపకం చేపట్టారు. సింగరేణి గనులు, డిపార్టుమెంట్లలోని ఖాళీ ప్రదేశాలు, కార్మిక కాలనీలు, సింగరేణి రోడ్లు, తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నారు. అలాగే సింగరేణి ఉద్యోగులు ఇళ్లలో నాటుకునేందుకు, పరిసర ప్రాంతాల ప్రజలకు సైతం సింగరేణి ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేయనున్నారు.

పదెకరాల్లో పండ్ల తోటలు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని మొదలుపెట్టి జిల్లాలో కొనసాగిస్తున్నాం. ఈసారి జిల్లాలో 36లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే కొన్ని పంచాయతీల్లో ఎవెన్యూ ప్లాంటేషన్, ఇతరాత్ర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం పూర్తయింది. ప్రజలకు అవసరమైన మొక్కలు సైతం అందిస్తున్నాం. ఈసారి జిల్లాలో కనీసం పదెకరాల్లో పండ్ల తోటలు పెంచాలని నిర్ణయించాం.

– కుటుంబరావు, అడిషనల్ డీఆర్‌డీవో

రైతు సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజ్ నం.5లోని రైతువేదికలో సోమవారం ఎమ్మెల్సీ విఠల్‌తో కలిసి రైతులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విద్యుత్, ఎరువులు, నీళ్లు ఇవ్వకుండా.. చెరువులు బాగుచేయకుండా వ్యవసాయాన్ని అధోగతి పాలుచేసిందని ఆరోపించారు. తెలంగాణ రైతులకు మూడు గంటల విద్యుత్ చాలని రేవంత్‌రెడ్డి మాట్లాడటం రైతుల కడుపుకొట్టే విధంగా ఉందని మండిపడ్డారు. రాష్ట్రంలోని రైతులకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మైదం రమేశ్ (ఫైల్)

భీమిని: మండలంలోని మల్లిడి గ్రామానికి చెందిన మైదం రమేశ్ (48) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కూతురు వివాహానికి చేసిన రూ.4 లక్షల అప్పులు తీర్చలేక రమేశ్ మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో ఈనెల 1న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆసుపత్రికి అటు నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి


అంజి(ఫైల్)

దండేపల్లి: మండలంలోని ఇప్పల గూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ ఆత్రం అంజి(20) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి సోమవారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం..రెబ్బనపల్లి శివారులోని పొలంలో కేజీవీల్స్ ట్రాక్టర్‌తో జంబు కొడుతుండగా, ప్రమాదవశాత్తు పొలంలో బోల్తాపడింది. ట్రాక్టర్ ఇంజిన్ కింద బురదలో ఇరుక్కున్న అంజి అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ విషయమై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా, ఫిర్యాదు అందలేదు. మృతదేహాన్ని ప్రమాద స్థలం నుంచి లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని పేర్కొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్‌ను అడ్డుకున్న కార్మికులు


ట్రాక్టర్‌కు అడ్డంగా కూర్చున్న కార్మికులు

నెన్నెల: మండల కేంద్రంలో పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ ట్రాక్టర్‌ను పారిశుధ్య కార్మికులు సోమవారం అడ్డుకున్నారు. 12 రోజులుగా కార్మికులు సమ్మెలో ఉండడంతో గ్రామంలో చెత్త పేరుకుపోయింది. సర్పంచ్ సుజాత, కార్యదర్శి సాగర్ ప్రైవేటు వ్యక్తుల సహాయంతో ట్రాక్టర్‌ను నడిపిస్తూ చెత్త సేకరణ చేస్తుండగా కార్మికులు అడ్డుకుని ట్రాక్టర్ ముందు కూర్చుని నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు అందరూ సహకరించాలని కోరారు. 12వ రోజు సోమవారం సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు ఒంటికాలిపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మికులు లేతకారి కుమార్, రాజేష్, మల్లాగౌడ్, మారయ్య, వెంకటి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రబలుతున్న వ్యాధులు

- చాపకింద నీరులా విస్తరిస్తున్న జ్వరాలు
- జిల్లాలో 7 డెంగీ కేసుల నమోదు
- వైరల్ జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు


నిల్వ నీటిలో మందు చల్లుతున్న వైద్య సిబ్బంది


జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలోని ఓపెన్ ప్లాట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం


లక్ష్మీనగర్‌కాలనీలో ఓపెన్ ప్లాట్‌లోకి మురుగునీరు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లాలో సీజనల్ వ్యాధులు దడ పుట్టిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ నీరు నిలువడంతో దోమలు విజృంభిస్తున్నాయి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు వారి డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలను వర్షాకాలం ప్రారంభానికి ముందే చేపట్టాల్సి ఉన్నా ఈ ఏడాది మాత్రం ఆ దిశగా కార్యక్రమాలు చేపట్టలేదు. జిల్లాలో వర్షాలు కురవడం, వేసవి కాలం మాదిరి ఎండలు దంచి కొట్టడంతో వాతావరణం వర్షాకాలానికి భిన్నంగా ఉంది. దీంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతూనే, దోమల విజృంభణతో వ్యాధుల బారిన పడుతున్నారు.

మంచిర్యాల జిల్లాలో ఆరేళ్లుగా నమోదవుతున్న వ్యాధులు						
వ్యాధి	2018	2019	2020	2021	2022	2023
డెంగ్యూ	88	346	32	118	116	7
మలేరియా	3	2	9	0	3	0

అన్ని శాఖలు కలిసి పనిచేస్తేనే...

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు, వ్యాధులు విజృంభించినప్పుడు నివారణకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలి. మున్సిపాలిటీలో, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ ఇలా అన్ని శాఖలు కలిసి సమన్వయంగా పనిచేయాలి. ప్రస్తుతం మున్సిపాలిటీల్లోని కార్మికులు మాత్రమే పారిశుధ్య పనులను చేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కేవలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశాలకు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి అవగాహన కల్పించడం లేదు. ప్రతీ శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిరంతరం జరిగేలా అన్ని ప్రభుత్వ శాఖలు చూడాల్సిన బాధ్యత ఉంది.

పెరుగుతున్న జ్వరాలు...

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జిల్లాలో డెంగీ కేసులు ఇప్పుడిప్పుడే నమోదు అవుతుండగా, జ్వరాల సంఖ్య రోజురోజుకు పెద్ద ఎత్తున పెరుగుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రతిరోజు ఓపి 300ల వరకు ఉంటే, ఇటీవల ఈ సంఖ్య 400లకు పైగా పెరిగింది. జిల్లాలో గతేడాది డెంగీ కేసులు 116 నమోదు కాగా ఈ ఏడాది 7 కేసులు నమోదయ్యాయి. మలేరియా కేసులు గతేడాది 3 నమోదు కాగా, ఈ ఏడాది ఒక్కటి కూడా నమోదు కాలేదు. డయేరియా కేసులు గతేడాది 1,169 నమోదు కాగా, ఈ ఏడాది 2,432 నమోదయ్యాయి. టైఫాయిడ్ కేసులు గతేడాది 2,031 నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 924 నమోదు కాగా, జ్వరాలు గతేడాది 5,300లు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 3,141 నమోదయ్యాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు చిన్నారులు, పెద్దలు, వృద్ధులతో నిండుతున్నాయి.

జిల్లాలో అప్రమత్తం చేశాం



జిల్లాలో డెంగీ కేసులు పెరగకుండా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. జిల్లా ఆసుపత్రిలో డెంగీ నిర్ధారణకు ఎలిసా టెస్టును ఉచితంగా చేస్తున్నారు. అనుమానితుల నుంచి సేకరించిన శాంపిళ్లను టెస్టుకు పంపించి, ఆ రిపోర్టు ఆధారంగానే డెంగీని నిర్ధారణ చేస్తాం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా సీజనల్ వ్యాధులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ మీటింగ్ పెట్టాం. గత నెలలో మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లకు రెండు రోజుల పాటు అవగాహన సదస్సును నిర్వహించాం. అన్ని రకాల మందులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. పీహెచ్‌సీల వారిగా పరిశీలన చేస్తున్నాం.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

‘ట్రేడ్ యూనియన్లు యాజమాన్యాలకు తొత్తు’


మాట్లాడుతున్న కామెర గట్టయ్య

పాతమంచిర్యాల: సింగరేణిలో ట్రేడ్ యూనియన్లు యాజమాన్యాలకు తొత్తుగా మారాయని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కామెర గట్టయ్య, కో కన్వీనర్ నీరటి రాజయ్య ఆరోపించారు. జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ట్రేడ్ యూనియన్లు యాజమాన్యాలతో కుమ్మక్కై కార్మికుల పోరాటాలను నీరుగారుస్తున్నాయన్నారు. కార్మికుల్లో చీలికలు తీసుకువస్తున్నారని అన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘాలు పలు అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర కమిటీ నాయకులు మిట్టపల్లి కుమారస్వామి, గొడిశెల శ్రీమరి, వెంగళ కనకయ్య, దాసరి జనార్దన్, కాసర్ల ప్రసాద్‌రెడ్డి, పోశం, చంద్రశేఖర్, పురంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

22న నవోదయ 9వ తరగతి ప్రవేశపరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీల భర్తీ కోసం ఈనెల 22న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాలయంలోని పలు ఖాళీలకు ఉమ్మడి జిల్లా నుంచి 719 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని విద్యాలయం, సెంట్ క్లారిటీ స్కూళ్లలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సాగుభూమిలో వెలిసిన గుడిసెలు

- న్యాయం చేయాలని రైతుల వేడుకోలు

జన్నారం: 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూమిలో కొందరు గిరిజనులు అక్రమంగా గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. 2011లో లక్ష్మీపూర్ తండాకు చెందిన బుక్య బలిరాం, శశికళ, శివకుమార్, శ్రీనివాస్, చంద్రకళతోపాటు మరికొందరు ఈ భూమిని చదును చేసుకుని గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు పత్తి విత్తనాలు వేయగా, అప్పుడు అటవీ అధికారులు, పోలీసులు ఆధ్వర్యంలో గుడిసెలు తొలగించి కేసులు నమోదు చేశారు. ఆ సమయంలో బుక్య బలిరాం మరికొందరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో అధికారులు కొన్నిరోజులు వదిలేశారు. అప్పటినుంచి బలిరాంతోపాటు మరికొందరు సుమారు 20 ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నారు. ఇటీవల లక్ష్మీపూర్ తండాకు చెందిన కొందరు అక్రమంగా గుడిసెలు వేసుకున్నట్లు బలిరాం శశికళ, చంద్రకళ విలేకరులకు తెలిపారు. పత్తి పంటను తొలగించి గుడిసెలు వేసుకున్నారని వాపోయారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు దృష్టిసారించి మాకు న్యాయం చేయాలని కోరారు. ఎస్సై సతీశ్‌ను సంప్రదించగా, దాడికి పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేశామన్నారు.


సాగు భూమిలో వేసుకున్న గుడిసెలు

అడవిలో అక్రమంగా గుడిసెలు

- జన్నారం అటవీ డివిజన్ పరిధిలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలో కొందరు అక్రమంగా గుడిసెలు వేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందన్‌పల్లి రేంజ్ హాస్టల్‌తండా గ్రామ పంచాయతీకి గుండువాయి అలయ సమీపంలో దట్టమైన అడవిలో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన సుమారు 20 మంది ఆదివాసీ గిరిజనులు అక్రమంగా గుడిసెలు వేసుకున్నారు. వేసవి నుంచే చదును చేసి గుడిసెలు వేసుకుని బావి తవ్వుకుని అక్కడే నివాసం ఉంటున్నారు. గత కొన్నినెలలుగా వారు ఉంటున్నట్లు విషయం అధికారులకు తెలిసింది. ఐదు రోజులు క్రితం వెళ్లి వారిని గుడిసెలు తొలగించాలని సూచించారు. తమ పూర్వీకుల పట్టా భూమి ఉందని, అందుకే గుడిసెలు వేసుకున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్ ఇచ్చినా ససేమిరా ఒప్పుకోలేదు. సోమవారం పోలీసులతో వచ్చి మరోసారి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏదైనా ఆధారాలు ఉంటే లీగల్‌గా వెళ్లాలని, ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకోవాలని సీఐ కృష్ణారెడ్డి సూచించారు. కుల పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని వారు చెప్పినట్లు రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు. ఎస్సై సతీశ్, డీఆర్వో శ్రీరాం తదితరులు ఉన్నారు.


ఆదివాసీ గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ

- పంటల సాగులో అన్నదాతలకు సాయం
- సందేహాల నివృత్తికి సలహాలు, సూచనలు

ఎరువుల డీలర్లకు దేశీ శిక్షణ


కిష్టంపేట రైతువేదికలో ఎరువుల డీలర్లకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త

చెన్నూర్‌రూరల్: వ్యవసాయంలో అన్నదాతలకు అనేక సందేహాలు ఉంటాయి. వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేయడం వ్యవసాయశాఖ అధికారులకు అది సాధ్యం కాదు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం విత్తన, ఎరువుల దుకాణదారులకు ప్రత్యేకంగా డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్(దేశీ) శిక్షణ ఇస్తోంది. వారానికి ఒక రోజు చొప్పున 42 వారాల పాటు పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో విత్తనాలు, ఎరువుల మందులు విక్రయించే డీలర్లు రైతులకు సలహాదారులుగా నడుచుకోవాలన్నది ప్రభుత్వం లక్ష్యం.

జిల్లా వ్యాప్తంగా..

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 3.60 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతున్నాయి. అందుకుగాను 55 మంది ఏఈవోలు సాగులో రైతులకు సలహాలు ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిజ్ఞానం మరింత అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఎరువుల డీలర్లకు ఒక్కో బ్యాచ్‌లో 40 మందికి శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో రెండు బ్యాచ్‌లు శిక్షణ పొందుతున్నాయి. శిక్షణ అనంతరం పంటల సాగులో అవగాహన పెంచుకున్న తమ వద్దకు వచ్చే రైతులకు డీలర్లు తగిన సూచనలు ఇస్తున్నారు. ఎరువులు, పురుగుల మందుల వినియోగం తెలియని అన్నదాతలు పలు ప్రకటనలకు ప్రభావితం అవుతున్నట్లు గుర్తించారు. పైరుకు సోకిన తెగులు గురించి సరైన అవగాహన లేక తోచిన పురుగుల మందు, ఎరువులను వినియోగిస్తున్నారు. పంటకు సోకిన తెగులును అధ్యయనం చేసి మరింత సమాచారానికి అవసరమైతే ఏఈవోలను సంప్రదించి డీలర్లు రైతులకు సలహాలు ఇస్తున్నారు. దుకాణాలు వచ్చిన రైతులకు డీలర్లు అవగాహన కల్పించడంతో ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ ఆర్థికంగా అన్నదాతలు నష్టపోకుండా చూస్తామని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

ధ్రువపత్రాలు అందిస్తున్నాం



రైతులకు మేలు జరగాలనే ఎరువుల డీలర్లకు శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందజేస్తున్నాం. పంటల సాగులో ఎరువులు, పురుగుల మందులపై రైతులకు డీలర్లు అవగాహన కల్పిస్తారు. సలహాలు, సూచనలు ఇస్తారు. ఎరువులు, పురుగుల మందులు ఎంత మోతాదులో వాడాలో తెలియజేస్తారు. – కవిత, ఏవో, చెన్నూర్

వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


రోదిస్తున్న మృతురాలి తల్లి సుమిత్ర


ఆదె అంజలి(ఫైల్)

- తేజిగూడలో ఘటన
- కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు

వాంకిడి: వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని తేజిగూడ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గొర్రె సుమిత్ర, బాలాజీ దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. కుమార్తె అంజలి(18)కి అదే గ్రామానికి చెందిన ఆదె శంకర్‌తో మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిపించారు. పెళ్లయిన కొన్ని రోజులకే అల్లుడు వరకట్నం అడుగుతున్నాడని అంజలి ఇంటికి వచ్చి తల్లిదండ్రులతో చెప్పింది. రూ.లక్ష ఇచ్చి ఆమెను అత్తారింటికి పంపించారు. కొన్ని నెలలకు అంజలికి కూతురు పుట్టింది. అప్పటి నుంచి భర్త శంకర్, అత్త తానుబాయి, మామ రంగయ్య, మరిది సోమయ్య కలిసి మరో రూ.లక్షతోపాటు వ్యవసాయ భూమిని అదనపు కట్నంగా తేవాలని మానసికంగా, శారీరకంగా హింసించేవారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన అంజలి ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో దూలానికి తన చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలికి ఏడాదిన్నర కూతురు ఉంది. తమ కుమార్తె ఆత్మహత్యకు అత్తింటివారి వరకట్న వేధింపుల కారణమని మృతురాలి కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

ఆత్మహత్యపై అనుమానాలు..

అంజలిని గొంతునులిమి అత్తింటివారు హత్యచేసి ఉంటారని, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకే చీరతోనే ఉరివేసి వేలాడదీశారని మృతురాలి తల్లి, కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఒకే గ్రామంలో ఉన్న అంజలిని తమతో కలవనిచ్చేవారు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరునెలల క్రితం కూతురు అత్తారింటికి వెళ్తే నేడు శవమై పుట్టింటికి వచ్చిందని కన్నీరుమున్నీరుగా విలపించారు. తన పత్తి పంటలో గ్రామస్తులతో కలిసి ఆదివారం ఎరువులు వేసేందుకు వెళ్లిన అంజలి నేడు శవమై ఉండటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇద్దరికి ప్రతిభరత్న పురస్కారాలు


పురస్కారాలు అందుకుంటున్న రాజు, వెంకటేశ్

శ్రీరాంపూర్: వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చినవారికి హైదరాబాద్‌లో సర్వేజన సుఖినోభవంతు సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాలు అందించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీరాంపూర్‌కు చెందిన ఆరుముళ్ల రాజు, జె.వెంకటేశ్‌లకు ప్రతిభరత్న పురస్కారాలు అందజేశారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, జాతీయ వినియోగదారుల మండలి అధ్యక్షుడు కృష్ణారెడ్డితో ఈ పురస్కారాలు అందుకున్నారు. జేసీఐ ద్వారా వ్యక్తిత్వవికాస శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టినందుకుగాను వీరికి పురస్కారాలు అందించారు. కేంద్ర నాటక అకాడమీ సభ్యురాలు పి.భారతి, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యుడు వెంటపాటి కృష్ణాది శేషు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.

రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

కాసిపేట: కార్మికులు, అధికారులు రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఉత్పత్తి సాధించాలని బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ జీఎం గుప్తా తెలిపారు. సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై రక్షణ అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రమాదాలను ముందస్తుగా గుర్తించడం, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్(ఎస్ఎంపీ), సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌పై అవగహన కల్పించారు. నా రక్షణే నా బాధ్యత నుంచి నా రక్షణ కుటుంబ బాధ్యతగా సొంతంగా రక్షణ పొందాలని తెలిపారు. ఈ నెలంతా రక్షణ అవగాహన సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. మొదటిసారి గనికి వచ్చిన సేఫ్టీ జీఎంను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సన్మానించారు. గని మేనేజర్ అల్లావుద్దీన్, సింటాస్ అధికారి శర్మ, రక్షణాధికారి సునిల్‌కుమార్, టీబీజీకేఎస్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శులు శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవాలి

- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి


శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: భూగర్భ గనుల్లో ఉత్పత్తి ఖర్చును మరింత తగ్గించుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు, ప్లానింగ్) జి.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. ముందుగా ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించి అధికారులతో మాట్లాడారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వారికి సూచనలు చేశారు. వర్షపు నీటిని క్వారీలో వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఓబీ కాంట్రాక్టర్లతో ఓబీ వెలికితీతపై చర్చించారు. అనంతరం జీఎం బి.సంజీవరెడ్డితో కలిసి సీసీసీలోని సింగరేణి గెస్ట్ హౌస్ ఏరియా అధికారులతో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరియాలో భూగర్భ గనులు ఎక్కువగా ఉన్నందున ఉత్పత్తి ఖర్చు అధికమై నష్టాలు వస్తున్నాయన్నారు. దీనికోసం యంత్రాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా గనులవారీగా నిర్దేశించి..సాధించిన ఉత్పత్తిని సమీక్షించారు. మెటీరియల్ కొరత, యంత్రాల విడిభాగాలపై అధికారులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమం అనంతరం డైరెక్టర్ జీఎం కార్యాలయం ముందు ఉన్న నర్సరీలో మొక్కలు నాటారు. శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓటూ ఎం.రఘుకుమార్, ఏరియా ఇన్‌చార్జి ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీ అధికారులు పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, డీజీఎంలు చిరంజీవి, యాదయ్య, అరవిందరావు, సర్వే అధికారి సంపత్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


నితిన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్–పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీతానగర్‌కు చెందిన విమల (40) చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కాగజ్‌నగర్ మండలం సీతానగర్ గ్రామానికి చెందిన నితిన్(22) ఆమె తల్లి విమల, బంధువు శేఖర్ బైక్‌పై వెళ్తున్నారు. విద్యుత్ స్తంభాలను తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను రాస్పెల్లి వద్ద ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో విమల, నితిన్ తీవ్రంగా గాయపడగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నితిన్ ఆదివారం మృతి చెందగా, తల్లి విమల చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. తల్లీకొడుకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. కాగా నితిన్ అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. మృతదేహానికి జెడ్పీవైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ మౌల్కార్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలైన చిన్నారులు..


అనాథలైన చిన్నారులు

పిల్లల చిన్నవయస్సులోనే విమల భర్త రవి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి నితిన్‌తోపాటు ఇద్దరు కవలలు హర్షిత్, వర్షిత్‌ల బాగోగులు విమలే చూసుకుంటుంది. స్వగ్రామం సీతానగర్‌లో ఉపాధి దొరక్కపోవడంతో తల్లిగారి ఊరు దహెగాం మండలం బోర్కకుంటలో తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ పుట్టింటి నుంచి వచ్చిన మూడెకరాలతోపాటు మరో రెండెకరాలకు కౌలుకు తీసుకుని పత్తిసాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్నెళ్ల క్రితమే పెద్దకుమారుడు నితిన్‌కు వివాహం జరిగింది. తల్లితోపాటు సోదరుడిని కోల్పోయిన పదకొండేళ్ల చిన్నారులు అనాథలు మారారు. పెద్ద దిక్కు లేకపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.విమల మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంటుందని బంధువులు తెలిపారు.